క్లుప్తంగా

సీఎం జగన్‌ను కలిసిన ఎంపీ ఎంవీవీ



సీఎంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీ ఎంవీవీ

ఎంవీపీ కాలనీ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిశారు. బుధవారం విశాఖ పర్యటనకు వచ్చిన సీఎంని విశాఖ విమానాశ్రయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తూర్పు నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలు, సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. నగర అభివృద్ధికి పెద్దపీట వేయాలని కోరారు.

ఎంప్లాయీస్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న సుజాత, తదితరులు

మహారాణిపేట : ఏపీ ఎంప్లాయిస్ అసోసియేషన్ 2024 డైరీని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ అధికారి డాక్టర్ డి.సుజాత ఆవిష్కరించారు. బుధవారం ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏపీజీఈఏ రాష్ట్ర కార్యదర్శి పి.ఎం.జవహర్‌లాల్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వి.రమణ, వి.రాజేశ్వరి, సిటీ కోశాధికారి ఆర్.మురళీకృష్ణ, జాయింట్ సెక్రటరీ వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కళ్ల సంరక్షణపై శ్రద్ధ అవసరం

ఆరిలోవ: పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు కళ్ల సంరక్షణపై శ్రద్ధ చూపాలని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి చైల్డ్ సైట్ ఇన్‌స్టిట్యూట్ కన్సల్టెంట్ ఆప్తమాలజిస్ట్ అల్లూరి హిమబిందు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యార్థులు డిజిటల్ విధానంలో స్క్రీన్ చూస్తూ అభ్యసిస్తున్నారని, పుస్తకాలను ఎక్కువ సమయం ఒత్తిడితో చదవడం వల్ల కంటికి అలసట వస్తుందన్నారు. దీని ఫలితంగా కళ్లు పొడిబారడం, తల నొప్పి రావడం, దృష్టిలో అస్పష్టత, తలలో పార్శ్వ నొప్పి(మైగ్రేన్) తదితర సమస్యలు తలెత్తుతాయన్నారు. విద్యార్థులు పరీక్షలకు కొద్ది రోజుల ముందు వైద్యులను సంప్రదించి కంటి పరీక్షలు చేయించుకుని, సలహాలు, సూచనలు తీసుకోవాలని ఆమె సూచించారు. విద్యార్థులు చదువుతున్నప్పుడు ప్రతి 20 నిమిషాలకు 20 సెకన్ల పాటు 20 అడుగుల దూరంలో పుస్తకంలో అక్షరాలను చూడాలన్నారు. చదువుతున్నప్పుడు తరచూ కంటి రెప్పలు మూస్తూ, తెరుస్తుండాలన్నారు. ఎయిర్ కండిషన్, కూలర్లు, ఫ్యాన్లకు ఎదురుగా ఉండి చదవకూడదని, గాలి, వెలుతురు బాగా ఉండే గదులలో చదవాలని ఆమె సూచించారు.

135 మందికి వైద్య పరీక్షలు



మహిళలకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆరిలోవ: సేవా స్ఫూర్తి అసోసియేషన్, ధాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జీవీఎంసీ 10వ వార్డు రవీంద్రనగర్‌లో సేవా స్ఫూర్తి కార్యాలయంలో నిర్వహించిన ఈ శిబిరంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు 135 మందికి మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు పరీక్షలు చేశారు. మహిళలకు గైనిక్ పరీక్షలు, పొగాకు, పాన్ గుట్కా అలవాటు ఉన్న పురుషులకు నోటి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఒమ్మి అప్పలరాజు, సభ్యులు పాత్రుడు, ఆనంద్, తాతారావు, పద్మాజీ, వైద్యులు డాక్టర్ సుభద్ర, భవాని, ధాన్ ఫౌండేషన్ రీజనల్ కోఆర్డినేటర్ రాంకుమార్ పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్

- వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ
- 15వ వార్డులో ఉత్సాహంగా పాదయాత్ర



ప్రజలతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ

మద్దిలపాలెం: సంక్షేమ పథకాల రథ సారథిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తారని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 45వ రోజు బుధవారం 15వ వార్డు కొండవాలు ప్రాంతమైన కొత్త వెంకోజీపాలెం, సింహాద్రిపురంలో కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్యతో కలిసి ఎంపీ పర్యటించారు. గడపగడపకు వెళ్లి సమస్యలు తెలుసున్నారు. సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. లబ్ధిదారులతో మాట్లాడారు. అందిన సంక్షేమ పథకాల ప్రయోజనాలను ఎంపీకి వివరించారు. పథకాలను ఎలా సద్వినియోగం చేసుకున్నారో ఎంపీ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను చూసి ప్రతి ఒక్కరూ రాష్ట్రానికి మళ్లీ వైఎస్ జగన్ సీఎం కావాలని రాష్ట్ర ప్రజలు ముక్త కంఠంతో కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అప్పారి గిరిబాబు, పీలా వెంకట్, వెంకటలక్ష్మి, అధిక సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నిర్మాణ భవనంలో సీసీ కెమెరాల ఏర్పాటు



సీసీ కెమెరాలు పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ రాందాస్, తదితరులు

ఎంవీపీ కాలనీ: పెదవాల్తేర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. నేరాల నియంత్రణపై ఎంవీపీ క్రైమ్ పోలీసులు చేపడుతున్న చర్యల్లో భాగంగా నిర్మాణంలో ఉన్న భవనాల్లో సైతం సీసీ కెమెరాలను నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా పెదవాల్తేర్‌కు చెందిన కేవీ రామయ్యకు చెందిన నిర్మాణంలో ఉన్న అపార్టుమెంట్‌లో బుధవారం సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో వాటిని ద్వారకా క్రైమ్ సీఐ శ్రీనివాసరావు, ఎస్.రాందాస్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేరస్తులను పట్టుకోవడంలో సీసీ కెమెరాలు ప్రత్యేక పాత్ర పోషిస్తాయన్నారు. వీటిని ప్రతి ఇంటి బయట, అపార్టుమెంట్లలో, వాణిజ్య సముదాయం ఆవరణలో ఏర్పాటు చేసుకోవడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రాందాస్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: విమ్స్‌కు సంబంధించిన సబ్‌స్టేషన్‌లో 33/11 కేవీ పరిధి 11 కేవీ కైలాసగిరి ఫీడర్ నిర్వహణ, హనుమంతవాక నుంచి విశాలాక్షినగర్ వెళ్లే మార్గంలో విద్యుత్ స్తంభాల తరలింపు పనుల దృష్ట్యా గురువారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, కైలాసగిరి రోడ్డు, హనుమంతవాక కొండవాలు, బీఎస్‌ఆర్ నగర్, తోటగరువు ప్రాంతాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఇందిరానగర్‌లో..

ఆరిలోవ: విమ్స్‌కు సంబంధించిన సబ్‌స్టేషన్‌లో 33/11 కేవీ పరిధి 11 కేవీ ఇందిరానగర్ ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా గురువారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఇందిరానగర్, రాజీవ్‌నగర్, ఆదర్శనగర్, సుందర్‌నగర్, రవీంద్ర నగర్, తదితర ప్రాంతాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

పిఠాపురం కాలనీ సంత కొనసాగించాలి



విలేకరులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు కృష్ణారావు

మద్దిలపాలెం : జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీలో ప్రతి సోమవారం నిర్వహించే వారపు సంతను కొనసాగించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పిఠాపురం కాలనీలోని పార్టీ కార్యాలయంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణారావు విలేకరులతో మాట్లాడుతూ 16 ఏళ్లుగా పిఠాపురం కాలనీలో వారపు సంత కొనసాగుతుందన్నారు. ఈ సంతను స్థానిక కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ అక్రమంగా నిలిపివేయడాన్ని ఆయన తప్పుపట్టారు. సంతలో ఉన్న చిరువ్యాపారులతో ముందస్తుగా సంప్రదించకుండా ఆకస్మికంగా నిలిపివేయడం అన్యాయమన్నారు. 2014 వీధి విక్రయాల చట్టం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సంత వ్యాపారులకు ఉపాధికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సంతను కొనసాగించాలని కోరుతూ ఈనెల 23వ తేదీ కళాభారతి జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. యథావిధిగా వచ్చే సోమవారం సంత నిర్వహించనున్నామని చెప్పారు. దీన్ని అడ్డుకోవడానికి పూనుకోవద్దని కార్పొరేటర్‌కు ఆయన హితవు పలికారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు కె.కుమారి, అనపర్తి అప్పారావు, భుజంగరావు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సరస్వతిదేవి సేవలు చిరస్మరణీయం



సరస్వతిదేవి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎంవీపీ కాలనీ: మానసిక వికలాంగుల అభ్యున్నతికి లెబెన్స్ హిల్ఫే ఇండియా వ్యవస్థాపకురాలు డాక్టర్ సరస్వతిదేవి అందించిన సేవలు చిరస్మరణీయమని రోటరీ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కిషోర్‌కుమార్ అన్నారు. డాక్టర్ సరస్వతి దేవి జయంతి వేడుకలను బుధవారం ఎంవీపీ కాలనీలోని లెబెన్స్ హిల్ఫే మానసిక వికలాంగుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. కిషోర్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని సరస్వతిదేవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లెబెన్స్ హిల్ఫే మానసిక వికలాంగుల పాఠశాలను డాక్టర్ సరస్వతిదేవి ఒక పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దారన్నారు. కొద్ది రోజులుగా పాఠశాల విద్యార్థులకు పలు క్రీడా పోటీలు నిర్వహించారు. ఆయా క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి కిషోర్‌కుమార్ బహుమతులు ప్రదానం చేశారు. డైరెక్టర్ లక్ష్మి సూర్యశ్రీ, రోటేరియన్లు పి.నాగరాజు, వెంకటరావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

ఎంవీపీ కాలనీ: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ద్వారకా జోన్ క్రైం సీఐ శ్రీనివాసరావు అన్నారు. సైబర్ క్రైమ్స్, పోక్సో, గంజాయి చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంవీపీ కాలనీలోని వీఎంసీ కళాశాలలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ తెలిసి తెలియని వయసులో నేరాలకు పాల్పడి ఎంతో మంది విద్యార్థులు జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఆకతాయితనంలో చేసే సాంకేతిక నేరాలు సైబర్‌క్రైమ్ చట్టాల పరిధిలోకి వస్తాయన్నారు. పెరుగుతున్న టెక్నాలజీని వినియోగించి సోషల్ మీడియాలో పక్కవారిపై అవమానకర పోస్టులు పెడుతూ కష్టాలను కొనితెచ్చుకోవద్దన్నారు. సైబర్ క్రైమ్ చట్టాలను విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ చదువుకునే సమయంలో విద్యార్థులు పూర్తిగా వారి లక్ష్యాలపై దృష్టిసారించి భవిష్యత్‌ను ఉన్నతంగా నిర్మించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రామ్‌దాస్, కళాశాల ఎన్‌ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ పి.అప్పారావు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

మానవ మనుగడకు వారధి భాష

- ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి
- ఘనంగా మాతృభాషా దినోత్సవం



కృష్ణా కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయబాబు



ప్రసంగిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: మానవ మనుగడకు వారధి భాష అని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఏయూ తెలుగు విభాగంలో సమైక్యభారతి, ఆంధ్ర భవన్ సంయుక్తంగా ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా మాతృభాష దినోత్సవం–తెలుగు భాష విశిష్టత అంశంపై నిర్వహించిన సదస్సును వీసీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఏ జీవికీ లేని సౌలభ్యం, ప్రత్యేకత భాష రూపంలో మానవులకు లభించిందన్నారు. తన ఉన్నతికి, ఇతర భాషలను అభ్యసించడం అవసరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసి పాఠ్య పుస్తకాలను విద్యార్థుల సౌలభ్యం కోసం ద్విభాషా ముద్రణ జరిపి అందిస్తోందన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ఇటువంటి నూతన ప్రక్రియలతో ఆంధ్రప్రదేశ్‌ని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుపుతున్నారన్నారు. నేడు ఇదే విధానాన్ని యూజీసీ సైతం అవలంభించాలని చూస్తోందన్నారు. ఆర్ట్స్–కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ తెలుగు వర్ణమాల మానవ నాడీ మండల వ్యవస్థను చైతన్యపర్చగల శక్తి కలదని, ప్రపంచంలో ఏ భాషకు ఇటువంటి శక్తి లేదన్నారు. సీనియర్ జర్నలిస్ట్ తుర్లపాటి నాగభూషణరావు మాట్లాడుతూ భాష సమాజం పరస్పర సంబంధం కలవని, అవి నిరంతరం మార్పుకు గురవుతూనే ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి ఆచార్య జర్రా అప్పారావు, ఆచార్య వెలమల సిమ్మన్న, ఆచార్య జి.యోహాన్‌బాబు, సమైక్య భారతి సమన్వయకర్త పి.కన్నయ్య, డాక్టర్ బి.వెంకటస్వామి, విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగు పరిశోధక విద్యార్థి ఇళ్ళ మురళీధర్ రచించిన అర్ధనూట పదహార్లు, త్రిశతి, 25 ప్రదర్శనలు గ్రంథాలు, మల్లిపురం జగదీష్ రచించిన మన్నెం ముచ్చట్లు గ్రంథాల ఆవిష్కరణ నిర్వహించారు.

బీచ్ రోడ్డు: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని బుధవారం కృష్ణా కళాశాలలో ఘనంగా నిర్వహించారు. మొదటిగా తెలుగు తల్లి చిత్రపటానికి విద్యార్థులు, అధ్యాపకులు పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. మా తెలుగు తల్లికి మల్లెపూదండ పాటను ఆలపించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు మాట్లాడుతూ మనం మొదటిగా నేర్చుకున్న భాష మాతృభాష అని, తన తల్లిని ఎవరూ చెప్పకుండానే అమ్మా అని బిడ్డ ఎలా పిలుస్తాడో మాతృభాష కూడా అంతే అన్నారు. మాతృభాష సహజంగా అబ్బుతుందని, అప్రయత్నంగా వస్తుందని చెప్పారు. అమ్మను కాపాడుకున్నట్టే మాతృభాషను కూడా కాపాడుకోవాలన్నారు.

గ్రంథాలయంలో..

ఎంవీపీ కాలనీ: స్థానిక శాఖా గ్రంథాలయంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా గ్రంథాలయ అధికారి ఉమామహేశ్వరరావు.. సరస్వతి దేవి చిత్రపటానికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జేకే స్కూల్ విద్యార్థులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ ప్రజా పోరు యాత్ర ప్రారంభం

ఎంవీపీకాలనీ: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజాపోరు యాత్రను ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రజాపోరు యాత్ర కన్వీనర్ సాగి కాశీవిశ్వనాథ్ ప్రారంభించారు. బుధవారం లాసన్స్ బే కాలనీలోని ఆ పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కాశీవిశ్వనాథ్ మాట్లాడుతూ గతంలో నిర్వహించిన ప్రజాపోరు యాత్రకు మంచి స్పందన లభించిందన్నారు. దీంతో మరోసారి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు మాధవ్, విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పెదవాల్తేర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన వ్యక్తి

ఎంవీపీ కాలనీ: పెదవాల్తేర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. పెదవాల్తేర్ విశాఖ ఐ హాస్పటల్ సమీపంలో 50 సంవత్సరాల వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని బుధవారం రాత్రి స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి పోలీసుల చేరుకుని పరిశీలించారు. మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలియకపోవడంతో రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులకు సమాచారం అందించారు. దీంతో వారు మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుని వివరాలు తెలుసుకునేందుకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఏయూ సమాచారం

హల్ట్ ప్రైజ్ క్యాంపస్ ప్రోగ్రాంలో విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహించిన హల్ట్ ప్రైజ్ క్యాంపస్ ప్రోగ్రాంలో ఏయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. క్యాంపస్ స్థాయిలో కళాశాలకు చెందిన విద్యార్థినులు డి.రీష్మ, యు.దేవకి, బి.వింధ్య, జి.భవానిదేవిలు రైలు ప్రమాదాల నివారణ అనే అంశంపై తయారు చేసిన ప్రాజెక్టుకు ద్వితీయ బహుమతి లభించింది. రైలు ప్రమాదాలను నివారిస్తూ, ప్రజల ప్రాణాలను పరిరక్షించే దిశగా ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ఈ సందర్భంగా సదరు విద్యార్థులను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.కె.భట్టి, ఆచార్య వి.కృష్ణమోహన్, డాక్టర్ ఎస్.అరుణ, డాక్టర్ ఎస్.రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థపరత్వం అలవరుచుకోవాలి



దమ్మపాల గురుజీని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్

ఏయూ క్యాంపస్: ప్రతి ఒక్కరూ నిస్వార్థపరత్వాన్ని అలవరుచుకోవాలని బౌద్ధ గురువు, నేపాల్‌లోని సెంటర్ ఫర్ రైట్ వ్యూ మెడిటేషన్ వ్యవస్థాపకుడు ఆచార్య దమ్మపాల గురూజీ అన్నారు. బుధవారం ఏయూ తత్వశాస్త్ర విభాగాన్ని సందర్శించిన ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. సమాజంపై సరైన అవగాహన కలిగి ఉండడం ఎంతో అవసరమన్నారు. బుద్ధుని చరిత్ర తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, విభాగాధిపతి ఆచార్య వి.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారికి పుష్పయాగం



శ్రీవారికి నివేదించిన పూలు

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్–6లో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం మహాపూర్ణాహుతి, అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ చక్రత్తాళ్వార్‌తో భక్తుల అప్పుఘర్ తీరంలో సముద్ర స్నానం చేసి తరించారు. అనంతరం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో శ్రీవారికి వైభవంగా పుష్పయాగం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పుష్పాలు తొలుత స్వామివారికి నివేదించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

విజయదుర్గాదేవికి కుంకుమ పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎంపీ ఎంవీవీ

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు హనుమంతవాక వద్ద విజయదుర్గాకాలనీలో కొలువుదీరిన విజయ దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా బుధవారం అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. హనుమంతవాక, విజయ దుర్గాకాలనీ, సింహగిరికాలనీ, సంజయ్‌గాంధీకాలనీ నుంచి అధిక సంఖ్యలో మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, వార్డు కార్పొరేటర్ స్వాతి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎంపీని సత్కరించి జ్ఞాపిక అందజేశారు. పూజలు అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నసమారాధన చేపట్టారు.

మే 12న కొమెడిక్ యూజీఈటీ ప్రవేశ పరీక్ష

బీచ్ రోడ్డు: కర్ణాటక రాష్ట్రంలో ప్రముఖ విద్యా సంస్థలతో పాటు దేశ వ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే కొమెడిక్ యూజీఈటీ ప్రవేశ పరీక్ష మే 12న నిర్వహించనున్నట్టు ఏరా ఫౌండేషన్ సీఈవో మురళీధర్ తెలిపారు. ప్రవేశ పరీక్షలకు సంబంధించిన వివరాలను బీచ్ రోడ్డులోని ఓ హోటల్‌లో బుధవారం మీడియాకు వివరించారు. కర్ణాటకలోని 150కిపైగా ఇంజినీరింగ్ కాలేజీలు, దేశ వ్యాప్తంగా మరో 50 ప్రముఖ కాలేజీల్లో ఇంజినీరింగ్ కోర్సుల ప్రవేశం కోసం ఈ పరీక్షను నిర్వహించనున్నామన్నారు. ఇందుకు కోసం దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా ఏప్రిల్ 5వ తేదీ వరకు స్వీకరిస్తామన్నారు. ఈ ప్రవేశ పరీక్షను దేశ వ్యాప్తంగా 200 నగరాల్లో 400 కేంద్రాల్లో నిర్వహిస్తామని చెప్పారు. www. comedk. org వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

శ్రీకృష్ణా విద్యార్థులకు జాతీయ రికార్డులు



జాతీయ రికార్డుల సర్టిఫికెట్లతో విద్యార్థులు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఆదర్శనగర్‌లో శ్రీకృష్ణా గ్రామర్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆరు జాతీయ స్థాయి తెలుగు బుక్ ఆఫ్ రికార్డులు సాధించారు. పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు బుక్ ఆఫ్ రికార్డుల ప్రత్యేక పరిశీలకుడు డాక్టర్ వినకోట వెంకట బుచ్చిరాజు కార్యక్రమానికి హాజరయ్యారు. ఇక్కడ విద్యార్థులకు శతాధిక భగవద్గీత శ్లోక ధారణ, శతాధిక హిందీ కవితలు, ఆంగ్ల పర్యాయ పదాలు తదితర విభాగాలలో పోటీలు నిర్వహించారు. పలువురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ఆరు విభాగాలలో జాతీయ రికార్డుల్లో స్థానం సంపాదించారు. ఐదో తరగతి విద్యార్థి మద్దాల కారుణ్య 150 ఆంగ్ల పర్యాయపదాలను 2.47 నిమిషాలలో వల్లె వేసి రికార్డు సాధించింది. ఐదో తరగతి చదువుతున్న ద్వారపూడి శ్యామ్‌చంద్రిక 100కు పైగా హిందీ అంకెలను 45 సెకన్లలో ధారణ చేసి రికార్డు సాధించింది. ఆరు సంవత్సరాల చిన్నారి బొడ్డు గుణాత్మక దేశంలో అన్ని రాష్ట్రాల రాజధానుల పేర్లను 30.24 సెకన్లలో చెప్పి రికార్డు సృష్టించింది. వీటితో పాటు 50 మంది విద్యార్థులు శతాధిక భగవద్గీత శ్లోకాలు, మరో 50 మంది హిందీ కవితల ధారణ, 75 మంది ఎల్‌కేజీ విద్యార్థులు, మరో 75 మంది యూకేజీ విద్యార్థులు ఆంగ్ల అభినయ గేయాల ధారణ చేసి రికార్డులు పొందారు. దీంతో వారికి ఎంఈవోలు రవీంద్రబాబు, అనురాధ, తెలుగు బుక్ ఆఫ్ రికార్డుల పరిశీలకుడు బుచ్చిరాజు, పాఠశాల డైరెక్టర్ మోహన్‌కృష్ణ, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు.

ఆకతాయిలకు కౌన్సెలింగ్

సీతమ్మధార: నగరంలో రాత్రి పూట వాహనాలపై చక్కర్లు కొడుతున్న కొందరు ఆకతాయి యువకులకు బుధవారం ఫోర్త్‌టౌన్ క్రైం పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. అర్ధరాత్రి వేళ రోడ్లపై అనవసరంగా తిరగకూడదని, మళ్లీ కనిపిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌ఐ భాస్కరరావు హెచ్చరించారు.

తుక్కు వ్యాపారులతో సమావేశం

ఫోర్త్‌టౌన్ క్రైం పోలీస్ స్టేషన్ పరిధిలోని తుక్కు వ్యాపారులతో క్రైం ఎస్‌ఐ భాస్కరరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి షాపు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. దుకాణానికి వచ్చి వెళ్లేవారు కనిపించేలా హై క్వాలిటీ సీసీ కెమెరాలు అమర్చాలన్నారు. షాపు వద్దకు వచ్చి విక్రయించే వారి వివరాలను రికార్డులో నోట్ చేసుకోవాలని, బైక్‌లు తీసుకొచ్చిన వారి వివరాలు సేకరించాలని సూచించారు.